విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 30 మే 2025 8 పేజీలు

కపట ప్రేమ

- రైతాంగాన్ని మోసగిస్తున్న మోదీ
- మద్దతు ధర...మమ
- అన్నదాతల మండిపాటు
- కేజీకి రూ.6.90 పైసలు పెంపు

విత్తనాలు, నారు వ్యయం తడిసి మోపెడవుతోంది. ఎరువులు, పురుగు మందుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కూలి ఖర్చులు గణనీయంగా పెరిగాయి. ధరాభారంతో రైతుల సాగు వ్యయం ప్రతి ఏటా పెరిగిపోతోంది. ధరలు.. వ్యయం పెరిగే స్థాయిలో మద్దతు ధర పెరగకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈసారైనా మద్దతు ధర సాగు వ్యయానికి అనుగుణంగా ఉంటుందని ఆశించిన రైతులను నిరాశ పరిచింది. కేంద్ర ప్రభుత్వం బుధవారం వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరను ఖరారు చేసింది. గిట్టుబాటు ధర మాట ఎలా ఉన్నా మద్దతు ధర సాగు వ్యయ ఆధారంగా పెరుగుతుందని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది. మొక్కుబడిగా మద్దతు ధరను పెంచిందని రైతులలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. స్వామినాథన్ సిఫారసులు అమలు చేయకుండా పాలకులు మోసగిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు : కేంద్ర ప్రభుత్వానికి రైతులపై ఏ మాత్రం కనికరం లేదని తేటతెల్లమవుతోంది. బడ్జెట్ సమయంలో వారి సంక్షేమానికి గొప్పలు చెప్పిన మోదీ ప్రభుత్వం రైతుల కష్టానికి తగిన మద్దతు ధర ఇచ్చే విషయంలో కఠినంగానే ఉంటోంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తాజాగా ప్రకటించిన పంటల మద్దతు ధరే అందుకు ఉదాహరణ. ఎరువులు, పురుగుమందులు, డీజిల్, ఇతర యంత్ర పరికరాల రేట్లు, అద్దెలు ఒకవైపు పెరుగుతున్నా... పంటకు మద్దతు ధర పెంచేందుకు మనస్కరించడం లేదు. వరికి కేవలం కేజీకి రూ.6.90 పైసల్ (క్వింటాకు రూ.69) మాత్రమే పెంచి చేతులు దులుపుకుంది. గతేడాది రూ.117 పెంచగా ఈసారి ఏకంగా రూ.48 తగ్గించి ధర ప్రకటించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. పంట ఖర్చులు అధికంగా పెరిగిన నేపథ్యంలో మద్దతు ధరపై ఆశలు పెట్టుకున్న అన్నదాతలకు కేంద్ర బిజెపి ▶మిగతా 2లో..

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- ఉద్యమాలకు ఊపిరి కమ్యూనిస్టులే
- సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

విశాలాంధ్ర - కుక్కునూరు : పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని, ఉద్యమాలకు ఊపిరి ఒక్క కమ్యూనిస్టులు మాత్రమే అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, పార్టీ ఏలూరు జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ స్పష్టం చేశారు. గురువారం ఏలూరు జిల్లా కుక్కునూరులో సీపీఐ 16వ మండల మహాసభ స్థానిక చర్చి స్కూల్ ఆవరణలో జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, గిరిజన సంఘం అధ్యక్షుడు వరసా పాపారావు అధ్యక్షతన జరిగింది. తొలుత సిపిఐ కుక్కునూరు మండల కార్యాలయం నుంచి మహాసభ ప్రాంగణం వరకు కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. సమావేశ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కినేని వనజ మాట్లాడుతూ పేదల కోసం భూపోరాటం, పోడు భూమి,రైతు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కి ప్రజల, రైతుల కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడి పలు సమస్యలు పరిష్కరించుకున్న ఘనత సీపీఐకి దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ▶మిగతా 2లో..

నిరుద్యోగ భారతం

- ఉపాధి లేక విలవిలలాడుతున్న నిరుద్యోగ యువత
- దళిత, ముస్లిం యువకులపై అకృత్యానికి పాల్పడిన పోలీసులను సస్పెండ్ చేయాలి
- సీపీఐ అపరాల శాఖ మహాసభలో జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

విశాలాంధ్ర-రాజమండ్రి : దేశంలో రోజురోజుకు నిరుద్యోగం పెరిగి పనులు లేక దేశ యువత మానసిక ఆందోళనకు గురవుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు విమర్శించారు. గురువారం స్థానిక అపరాల సెక్షన్ సీపీఐ శాఖ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ బహిరంగ సభకు సిపిఐ శాఖ కార్యదర్శి జి.హరినాథ్ అధ్యక్షత వహించారు. మధు మాట్లాడుతూ ప్రతి ఏడాది డిగ్రీలు, బీటెక్‌లు పూర్తి చేసుకుని నిరుద్యోగ యువత ఉద్యోగాలు లేక ఉపాధి లేక పనిచేస్తామంటే పనులు లేక కొన్ని రాష్ట్రాల్లో అర్థాకలితో ▶మిగతా 2లో..

సీఎం కోనసీమ జిల్లా పర్యటన అడ్డుకుంటాం

ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రతీ మండలంలో విద్యారంగ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటి పరిష్కారం తర్వాత మాత్రమే సీఎం జిల్లా పర్యటనకు రావాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రం అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య కొర వడిందన్నారు. కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండల ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరుకొని 30 సంవత్సరాలు గడిచిందన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నార న్నారు. ఈ సమస్యపై నియోజకవర్గ ఎమ్మెల్యేకు చీమ కుట్టినట్టైన లేదన్నారు. మండపేట పట్టణంలో 100 మందిపైన చదువుతున్న ప్రాథమిక పాఠశాల 2 గదులతో కొనసాగు తోందని, కేశవరం గ్రామంలో 30 ఏళ్ళుగా ప్రహరీ గోడ లేకుండా హైస్కూల్ కొనసాగుతోందన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి నిధులు లేక పునాదుల వద్ద ▶మిగతా 2లో..

కేసుల విచారణ వేగవంతం చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై దాడులకు సంబంధించి నమోదైన కేసుల విచారణ వేగవంతం చేయాలని, ఎస్సీ, ఎస్టీల వర్గాల ఆర్థిక పురోభివృద్ధికి, సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు జిల్లెల్ల సత్య సుధామ, పొన్నమండ బాలకృష్ణ, డాక్టర్ సిఎం మంగరాజు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగిన దాడులకు సంబంధించి నమోదైన కేసులపై విచారణ వేగవంతం చేయాలని, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ముందుగా గత సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న కార్యాచరణపై సమీక్షించారు. కమిటీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సరైన బోధన జరగటం లేదని సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన సందర్భంలో కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను ▶మిగతా 2లో..

నాబార్డు నిధులు రూ.7.37 కోట్లతో రోడ్ల అభివృద్ధి

విశాలాంధ్ర - నిడదవోలు : నియోజకవర్గంలో శిథిలమైన రహదారులకు నిధులు మంజూరు కావడంతో రోడ్ల అభివృద్ధికి మహర్దశ పట్టిందని స్థానిక ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అందుకు కృషి చేసిన మంత్రి దుర్గేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి, శాసనసభ్యులు కందుల దుర్గేష్ చొరవతో నిడదవోలు నియోజకవర్గంలో 11.60 కి.మీల 4 రోడ్ల పనులకు రూ.7.37 కోట్ల నాబార్డు నిధులు మంజూరు అయ్యాయి. ఈ నేపథ్యంలో ఉండ్రాజవరం మండలంలోని పైడిపర్రు నుండి సత్యవాడ, పెరవలి మండలంలోని కానూరు నుండి నడుపల్లి కోట, కాపవరం నుండి కొత్తపల్లి అగ్రహారం. నిడదవోలు ▶మిగతా 4లో..

యోగాతో శారీరక దృఢత్వం

విశాలాంధ్ర-ఏలూరు: ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు.యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ద్వారకా తిరుమలలోని హరిత హోటల్ వద్ద జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఆర్డీఓ రమణ, ప్రజలతో కలిసి జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతీ ఒక్కరూ ఒత్తిడితో కూడిన జీవనం గడుపుతున్నారని, యోగా ద్వారా మానసిక,శారీరక దృఢత్వం కలుగుతుందని, యోగాను ప్రతి ఒక్కరు వారి జీవనశైలిలో భాగంగా చేసుకోవాలన్నారు. జిల్లాలో వెయ్యి మందికి పైగా యోగా ట్రైనర్లను గుర్తించామని, వారితో జిల్లా వ్యాప్తంగా మే, 21 వ తేదీ నుండి జూన్, 21వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రాంతాలలోని ప్రజలతో యోగాభ్యాసన చేయించడంతోపాటు, యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. గ్రామ, వార్డుస్థాయిలో ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు మండల స్థాయిలో జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు, జిల్లా స్థాయిలో జూన్ 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నా మన్నారు. జూన్ 16 నుంచి 18 వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డి గూడెం ఆర్డీఓ రమణ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాలిని, పర్యాటక అభివృద్ధి అధికారి పట్టాభిరామయ్య, తహసీల్దార్ సుబ్బారావు, ఎంపిడిఓ ప్రకాష్, యోగా శిక్షకులు జి.విజయలక్ష్మి, సిహెచ్. శివ, కె. వినోద్ కుమార్ ప్రభృతులు పాల్గొన్నారు.

అడ్డుకుంటాం (1వ పేజీ తరువాయి)

ఆగిపోయిందని, ఇలా చెప్పుకుంటూపోతే గ్రామానికొక సమస్యతో జిల్లా అభివృద్ధి కుంటుపడిందన్నారు. వెంటనే విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్యగా డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయడానికి, అరెస్టులు కావడానికి సిద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వెంకట్, జిల్లా నాయకులు సతీశ్, సందీప్, సాయిరాం, నూకన్న ప్రసాద్, కుమార్, శ్యామ్, సురేష్, సుహాస్ వినయ్, చిరు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం (1వ పేజీ తరువాయి)

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వడంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు 45.72 కాంటూరు లెవల్లో నిర్మిస్తేనే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందన్నారు.లక్షల ఎకరాలకు సాగు నీరు లభ్యంఅవడంతో పాటు పారిశ్రామిక అవసరాలను

తీరుస్తుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు కోసం భూములతో పాటు సర్వం ఇచ్చిన త్యాగధనులతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పరిహాసం ఆడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను యూనిట్ గా తీసుకొని ప్రతి నిర్వాసితుడికి ప్యాకేజి ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శించారు. దీపం పథకం క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు అందక గ్యాస్ సబ్సిడీ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాల్లో రహదారుల సౌకర్యం కల్పించాలని, ప్రతి గిరిజన గ్రామంలో అంగన్వాడీ కేంద్రంతో పాటు పాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వర్షాకాలం సమీపిస్తున్న క్రమంలో గిరిజనులు వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్, పోలవరం నియోజకవర్గ ఇన్చార్జి కారం దారయ్య, కుక్కునూరు సమితి కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, వేలేరుపాడు మండల సమితి కార్యదర్శి బాడిస రాము, జిల్లా సమితి సభ్యులు ఐతా సురేష్ బాబు,కూరాకుల బాబురావు, మండల కార్యవర్గ సభ్యులు మడిపల్లి రమణయ్య, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్,మహిళా సమాఖ్య నాయకులు కొన్నె జయశ్రీ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతం చేయాలి (1వ పేజీ తరువాయి)

అందిస్తున్నామని, ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షా ఫలితాలు దీనికి నిదర్శనమన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు జారీలో జాప్యం జరుగుతోందని, ఎస్సీ ఎస్టీ వర్గాల పిల్లలు పాఠశాలకు వెళ్లకుండా ఉంటున్నారని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకురాగా గతంలో ఆధార్ ఎన్రోల్ అయి ఉండడం వలన మరి ఒకసారి ఎన్రోల్ చేయడానికి సాధ్యపడదని, సంబంధిత పిల్లల వివరాలను సేకరించి ఆధార్ నమోదులో సాంకేతిక ఇబ్బందులను పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పేద వర్గాలకు వైద్య చికిత్సలు సక్రమంగా అందిస్తున్నామన్నారు. ప్రైవేటు ఆసుపత్రులలో లభ్యం కానీ కుక్క కాటు, పాము కాటు ఇంజక్షన్లు ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నాయన్నారు. కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలపై దాడులకు సంబంధించి కేసులు పోలీస్ స్టేషన్ స్థాయిలోనే నిర్వీర్యం అవుతున్నాయని ఎఫ్ఐఆర్ నమోదుకు జాప్యం జరుగుతుందని, దీనివల్ల బాధితులకు న్యాయం జరగడం లేదన్నారు. కమిటీ సభ్యులు జిల్లెల సత్య సుధామ మాట్లాడుతూ ఎస్టీ, ఎస్సీ వర్గాల వారిపై దాడులకు సంబంధించి బాధితులకు సకాలంలో నష్టపరిహారం అందుతోంది అన్నారు. గత సమావేశంలో చర్చించిన అన్ని సమస్యలు పరిష్కారం అయ్యాయని సంతృప్తిని వ్యక్తం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగలి వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ యు.భీమారావు,డిఎస్డబ్ల్యుఓ బి.వి.ఎస్.బి రామాంజనేయ రాజు, భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కె.కుమార్ రెడ్డి, నరసాపురం ఆర్డీవో దాసిరాజు, తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్ కౌసల్ భానో, గ్రామ వార్డు సచివాలయ అధికారి వై దోసి రెడ్డి, నర్సాపురం డి.ఎస్.పి డాక్టర్ జి.శ్రీవేద, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి, సిఐలు, వసతి గృహాల అధికారులు, జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కపట ప్రేమ (1వ పేజీ తరువాయి)

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులకు తీవ్ర నిరాశకు గురిచేసింది.

పొంతనలేని మద్దతు ధర

సాగుకు, వ్యయానికి,ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరకు ఏ మాత్రం పొంతనలేదు. ధరలు పెరిగిన స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర పెంచకపోవడంపై రైతాంగం నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఎంతో కాలంగా ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదు. క్వింటా ధాన్యం మద్దతు ధర రూ.2300 నుంచి రూ.2369కి పెంచింది. మద్దతు ధర క్వింటాకు రూ.500 నుండి రూ.600 పెంచి ఉంటే మేలు జరిగేదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కేవలం ధాన్యం క్వింటాకు మద్దతు ధర రూ.69 విదిల్చిందని రైతులు వాపోతున్నారు.

అన్నదాతల అసంతృప్తి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వరి ప్రధాన పంటగా ఉంది. ఖరీఫ్, రబీ సీజన్లో కలిపి మొత్తం ఏలూరు జిల్లాలో 2,69,761 ఎకరాలలో వరి సాగవుతోంది. రెండు సీజన్లలో కలిపి మొత్తం 6,03,494 మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలో 4 లక్షల 71 వేల ఎకరాలు సాగు చేయగా 14 లక్షల 46వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తోంది.రైతు సొంత అవసరాలకు పోను,మిగిలిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు అమ్ముతున్నారు.2022 ఖరీఫ్ సీజన్లో కేంద్ర ప్రభుత్వం వరికి క్వింటాకు రూ.100 పెంచడంతో అప్పటివరకు రూ.1940 వరకు ఉన్న సాధారణ రకం ధాన్యం ధర రూ.2040 పెరిగింది.అదేవిధంగా గ్రేడ్ 'ఎ' రకం నుండి రూ.2060 కి పెరిగింది.2023 లో క్వింటాకు రూ. 143 పెంచడంతో సాధారణ రకానికి రూ.2183లు, గ్రేడ్ 'రకానికి రూ.2203లు దక్కనుంది. 2024లో రూ. 117 పెంచడంతో రూ.2300 అయింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.69తో రూ. 2369 వరకు వస్తుంది.మద్దతు ధరపై రైతులు పెదవి విరుస్తు న్నారు. పంట ఖర్చులు విపరీతంగా పెరిగిన తరుణంలో ఇది ఏ మూలకు సరిపోతుం దని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

పెరిగిన పెట్టుబడి వ్యయం

గత ఏడాదితో పోలిస్తే పంట ఖర్చులు విపరీతంగా పెరిగాయి.గత ఖరీఫ్ సీజన్లో దుక్కులకు రూ.2500 నుంచి రూ.3 వేల వరకు చెల్లించాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు. పురుగు మందుల కోసం గత ఏడాది రూ.2500 ఖర్చు చేయగా ప్రస్తుత సంవత్సరంలో రూ.3 వేల వరకు పెరిగింది. గడ్డిమందు కోసం గత ఖరీఫ్లో ఎకరాకు రూ.1000 వేలు ఖర్చు చేయగా ప్రస్తుతం రూ.300 నుండి రూ.500 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.పెట్రోల్ ధర సెంచరీ దాటగా, డీజిల్ ధర సెంచరీకి సమీపంలో ఉంది. ప్రస్తుతం లీటర్ పెట్రోల్ రూ.109.47 పైసలు ఉండగా డీజిల్ ధర రూ.98.20 ఉంది.గత ఏడాదితో పోలిస్తే పెట్రోల్ డీజిల్ ధరలలో పెద్దగా మార్పులు లేకపోయినా పంట కాలంలో వినియోగిస్తున్న యంత్రాల అద్దెలు పెరిగాయి.వర్షాలు కురిస్తే ఈ ఖర్చులు ఉంటాయి.వర్షాభావ పరిస్థితులు ఉత్పన్నమైతే ఈ వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది.పొలాలకు నీరు పెట్టేందుకు వినియోగించే యంత్రాల అద్దెపెరిగే అవకాశాలు లేకపోలేదు.కోత మిషన్ అద్దె, పొలం నుంచి ఇళ్లకు ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్ అద్దెలు పెరగనున్నాయి. చివరకు ఇళ్లకు ధాన్యం తెచ్చుకునేందుకు గత ఏడాది రూ.300 చెల్లించగా ప్రస్తుతం అదనంగా మరో రూ.50 చెల్లించాల్సి ఉంటుందని రైతులు తెలిపారు.మొత్తం మీద ఈ ఏడాది అదనంగా రూ.5 వేలు ఖర్చు అదనంగా పెరుగుతుందని రైతులు అంచనా వేస్తున్నారు. ఎకరాకు రూ.20 వేల వరకు ఖర్చు అవుతుండగా ఈ ఖరీఫ్ సీజన్లో రూ.25 వేల వరకు ఉండే అవకాశం ఉంటుందని రైతులు తెలిపారు.

మరోసారి రైతులను మోసం చేసిన మోదీ

ఎన్నికల సందర్భంగా తాను అధికారంలోకి వస్తే రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని,ఆత్మహత్యలు నివారిస్తానని చెప్పిన మోదీ అధికారం చేపట్టిన వెంటనే తమను నట్టేట ముంచారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెంచిన రూ.69తో రైతుల ఆదాయం ఏ విధంగా రెట్టింపు అవుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఢిల్లీలో రైతుల ఆందోళనల తర్వాత పంటలకు గ్యారెంటీ మద్దతు ధర చేస్తామని మోదీ హామీ ఇచ్చిన ఇప్పటివరకు అమలు చేయకపోవడం రైతులపై కేంద్ర చిత్తశుద్ధిని తెలియజేస్తుందని విమర్శిస్తున్నారు. మద్దతు ధర పెంచామని చెప్పుకోవడానికే కేంద్రం తప్ప రైతులకు ఇది ఏ మాత్రం గిట్టుబాటు కాదంటున్నారు. కేంద్రం దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే రైతులు మరో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు.

ప్రజల అభిమానానికి కృతజ్ఞతలు

నటి ఆమని

విశాలాంధ్ర -లింగపాలెం: సినిమా సన్నివేశాలలో పాల్గొనేందుకు లింగపాలెం మండలానికి వచ్చిన తనపై అభిమానం చూపుతున్న ప్రజలకు కృతజ్ఞతలని ప్రముఖ నటి ఆమని అన్నారు. సిద్ధధాత్రి క్రియేషన్స్లో నిర్మిస్తున్న చిత్రంలో ఆమని తల్లి పాత్రలో నటిస్తున్నారు. ఈమె నటించే కొన్ని సన్నివేశాలను లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం,నరసన్నపాలెం,భోగోలులో చిత్రీకరిస్తున్నారు. సినిమా చిత్రీకరణలో పాల్గొనటానికి వచ్చిన ఆమనిపై ప్రజలు

అభిమానం చూపారు. మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి ఈమెతో సెల్ఫీలు దిగారు. ప్రతి వారితో ఆమని చిరునవ్వుతో ఆప్యాయతను కనపరిచారు. ప్రధానంగా మహిళలు తనపై చూపిస్తున్న అభిమానానికి ఎంతో సంతోషంగా ఉందని ఆమని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నటించటం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని విశాలాంధ్రతో ఈమె తన అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రేక్షకుల ఆదరణ ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని తెలిపారు. ధర్మాజీగూడెంలోని ముసునూరు రెడ్డియ్య నివాసంలో జరిగిన చిత్రీకరణ అనంతరం ఈమెను చూసేందుకు, కరచాలనం చేసేందుకు, సెల్ఫీలు దిగేందుకు అభిమానులు పోటీపడ్డారు. కలిసిన వారందరి తోనూ ఈమె ఆప్యాయంగా ఉన్నారు.

తెనాలి ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి

విశాలాంధ్ర -భీమవరం: తెనాలిలో దళిత యువకులను నడి రోడ్డుపై పోలీసులు విచక్షణా రహితంగా లాఠీలతో కొట్టిన ఘటనపై వెంటనే హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ డిమాండ్ చేశారు. తెనాలి ఘటనను నిరసిస్తూ గురువారం భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి

తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రాన్ని సమర్పించారు. తొలుత జరిగిన ధర్నాలో గంట సుందరకుమార్ మాట్లాడుతు తెనాలిలో దళిత యువకులపై దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శాంతి భద్రతలు కాపాడవలసిన పోలీసులు నిరంకుశంగా వ్యవహరించడం సభ్యసమాజాన్ని తలదించుకునేలా చేసిందని గంటా ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నాలో పట్టెం శుభాకర్, జంగం మాణిక్యాలరావు, గెద్దం జార్జి, అంబటి ఆనందకుమార్, వి.సాగర్, సాదె మహేష్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-టి నరసాపురం: తెల్లం గ్రామంలో ఇటీవల కొమ్మంటి సత్యవతి అనారోగ్యంతో మృతి చెందింది.సత్యవతి కుటుంబానికి కేతిరెడ్డి సీతారామిరెడ్డి చంద్ర కాంతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారి

కుమారుడు కేతిరెడ్డి వీరారెడ్డి (చినబాబు),తెల్లం సర్పంచ్ ముప్పన స్రవంతి రమేష్ రెడ్డి గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లా దుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి వుండాలని అన్నారు.

నిరుద్యోగ భారతం (1వ పేజీ తరువాయి)

అలమటిస్తున్నారని అన్నారు. నిరుద్యోగ భృతి కల్పిస్తామని చెప్పిన ఏపీ ప్రభుత్వం ఇప్పటికీ ఎన్నికల హామీలను అమలు చేయలేదని యువతను మోసం చేస్తున్నదని ఆయన విమర్శించారు. గుంటూరు జిల్లా తెనాలిలో ముగ్గురు యువకులను అత్యంత కిరాతకంగా నడిరోడ్డు మీద కూర్చోబెట్టి కాళ్లపై విచక్షణ రహితంగా కొట్టిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఆయన కోరారు. ఆ పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం శిక్షించాలన్నారు. ఈ సమావేశములో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె. రాంబాబు, నగర కార్యదర్శి వి. కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ, టౌన్ కార్యవర్గ సభ్యులు పి. లావణ్య, టి. నాగేశ్వరరావు, నల్ల రామారావు, టి. త్రిమూర్తులు, జట్ల సంఘం అధికారబాడి అప్పల నాయుడు, అపరాల సెక్షన్ కార్యదర్శి కె. వేణు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమలో యోగాంధ్రకు భారీ ప్రణాళిక

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు భారీ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరం అల్లూరి సీతారామరాజు స్మృతివనంలో ఏర్పాటుచేసిన యోగ శిక్షణ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని యోగాసనాలను అభ్యసించారు. గంటపాటు జరిగిన యోగ శిక్షణ కార్యక్రమంలో సుమారు రెండు వందల మంది పిల్లలు, పెద్దలు పాల్గొనగా, మాస్టర్ ట్రైనర్స్‌ను అనుకరిస్తూ కలెక్టర్ కూడా అన్ని యోగాసనాలను కచ్చితత్వంతో చేసి చూపటం ఆశ్చర్యపరిచింది. శిక్షణ కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో విస్తృత అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడానికి ఆయా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు ఇలా అన్ని వర్గాల ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నామని చెప్పారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారీఎత్తున యోగా ప్రదర్శనా కార్యక్రమంకు సన్నాహక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఈవో ఇ.నారాయణ, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఏ.వి.అప్పారావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రవణ్, ఆయుష్ శాఖ డాక్టర్ హరి శ్రీనివాస్, యోగా మాస్టర్ ట్రైనీలు యు. వెంకటేశ్వర రాజు, పి.భవాని, పి.రోహిణి, ఇశా ఫౌండేషన్ భీమవరం కోఆర్డినేటర్ డాక్టర్ డి.విజయ, ప్రముఖ సంఘ సేవకులు కంతేటి వెంకటరాజు, అల్లూరి సీతారామరాజు సేవ సమితి యోగ మాస్టర్ బి హెచ్ వి సత్యనారాయణ రాజు, స్థానిక ప్రజలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలలో కూటమి ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర -కామవరపుకోట: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు విమర్శించారు. ఇల్లు లేని పేదలకు పల్లెల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూన్ రెండో తేదీ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ముందు జరిగే ధర్నా గోడపత్రికలను గురువారం టీవీఎస్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు పల్లెల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇస్తానన్న ప్రభుత్వ హామీని హర్షిస్తున్నామని అన్నారు. ధర్నాలో ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారులు ఇంటి స్థలం లేని వారందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కామవరపుకోట పట్టణ కార్యదర్శి గుద్దేటి సత్యనారాయణ, మండల కార్యవర్గ సభ్యులు చలమాల శ్రీనివాస రావు, తల్లిబోయిన రాములమ్మ, రైస్‌మిల్ వర్కర్ సీనియర్ నాయకులు బివి రాఘవులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కానూరి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన

విశాలాంధ్ర - నరసాపురం: ఉన్నత న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు హాలులో ప్యానెల్ లాయర్స్, లీగల్ సర్వీసెస్ సభ్యులు, పారా లీగల్ వాలంటీర్లు కు " పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013" పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి జి. గంగరాజు మాట్లాడారు. అందరూ

"పోష్" (ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్మెంట్ యాక్ట్" తెలుసుకోవాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డిపార్ట్మెంట్ ఉన్నత అధికారులు ఈ ఫిర్యాదులు పరిశీలించి లైంగికంగా బాధించిన వారికి శిక్షలు విధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ సభ్యులు, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గాలి

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలో సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వ్యవసాయాధికారులను ఆదేశించారు. ద్వారకాతిరుమల మండలంలోని ద్వారకాతిరుమల, గుండు గొలనుకుంట, సూర్యచంద్రరావుపేట, తదితర గ్రామాలలో గురువారం సుడిగాలి పర్యటన చేసి, వ్యవసాయ, అనుబంధ రంగాల సాగు పద్ధతులను పరిశీలించారు.

ముందుగా ద్వారకాతిరుమలలో ఫార్మ్ పాండ్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం గుండుగొలను గుంట గ్రామంలోని శ్రీ సుబ్రహ్మణేశ్వర ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సందర్శించి ఆదర్శ రైతు ఒబిలిశెట్టి గోపాలకృష్ణమూర్తి ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయంతో సాగుచేస్తున్న కాయగూరలు, పండ్ల తోటలను కలెక్టర్ పరిశీలించారు. సాగుకు వినియోగిస్తున్న పంచగవ్య వంటి సేంద్రియ వివరాలను రైతు గోపాలకృష్ణ మూర్తిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగం కారణంగా ప్రజలకు అనారోగ్యాలు వచ్చే అవకాశం ఉందని, సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల వినియోగం కారణంగా ప్రజలకు ఆరోగ్యంతో పాటు జీవితకాలం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం సూర్యచంద్రరావు

పేటలో బలుసు వీరభద్రయ్య క్షేత్రంలో కొబ్బరి, వక్క, అరటి, మిరియాల సాగును పరిశీలించారు. అనంతరం పశుగ్రాసం విత్తనాలను కలెక్టర్ అధికారులతో కలిసి పొలంలో చల్లారు. అనంతరం పోలసాని పల్లిలోని ఎస్ ఎం. ఆర్. జీడిపప్పు ప్రొసెసింగ్ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ వెంట జంగారెడ్డిగూడెం ఆర్డీఓ రమణ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాష,డ్వామా పీడీ సుబ్బారావు, ఉద్యానవనాలు శాఖ డిడి రామ్మోహన్, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవికుమార్, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటేష్, తహసీల్దార్ సుబ్బారావు, ఎంపిడిఓ ప్రకాష్,ప్రభృతులు పాల్గొన్నారు.

జూలై 9న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

బికెఎంయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల గురవయ్య, బండి వెంకటేశ్వరరావు



విశాలాంధ్ర-ఏలూరు: జులై 9వ తేదీన దేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సార్వత్రిక సమ్మె పిలుపులో గ్రామీణ ప్రాంతంలో ఉన్న పేద ప్రజలు, వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల గురవయ్య, బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక స్ఫూర్తి భవనంలో జరిగిన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా సమితి సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ కోటేశ్వరరావు ,ఆవుల శేఖర్ ఏలూరు జిల్లాకు నూతన నాయకత్వాన్ని ప్రకటించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులుగా కంచర్ల గురవయ్య (చింతలపూడి), జిల్లా ప్రధాన కార్యదర్శిగా బండి వెంకటేశ్వరరావు (ఏలూరు) ఎంపిక చేశారు. జిల్లా ఉపాధ్యక్షులుగా వేలేరుపాడు మండలా నికి చెందిన మడిమి కామయ్య, నూజివీడు నియోజక వర్గానికి చెందిన కొక్కిరపాటి ఆనంద్ సహాయ కార్యదర్శులుగా జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన గోలిమే బాల యేసు, కుక్కునూరు మండలానికి చెందిన కూరాకుల బాబురావును ఎన్నుకున్నారు. వీరితోపాటు మరో 19 మందిని జిల్లా సమితి సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, గురవయ్య మాట్లాడుతూ జిల్లాలో వన సంరక్షణ సమితులలో సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పైన, అడవి బంజర్లు,మిగులు భూముల సమస్యల పైన జిల్లాస్థాయి భూ సదస్సును నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ద్వారా సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని జిల్లాలో గ్రామీణ పేదలకు సక్రమంగా అమలయ్యేలా కార్యాచరణను చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

రేషన్ సరఫరా సక్రమంగా చేయాలి

విశాలాంధ్ర- ఉంగుటూరు : చౌక దుకాణాల వద్ద తప్పనిసరిగా నేమ్ బోర్డు సరుకులు పట్టిక కచ్చితంగా ఉండాలని ఉంగుటూరు తహసీల్దార్ పీవీ రవికుమార్ రెవిన్యూ అధికారిని ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఓలకు ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల నుంచి సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా అందించాలన్నారు. ఉంగుటూరు మండలంలో నీటి తీరువాయి బకాయి వసూలు పట్ల గ్రామ రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చెరువులు,

కాలువల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిటి పూర్ణచంద్ర వరప్రసాద్, ఆర్ ఐ బోడ దావీదు రాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.

2న ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఇళ్ల స్థలాల కోసం జూన్ రెండవ తేదీన తహసీల్దార్ కార్యాలయాల వద్ద సిపిఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వ ర్యంలో జరిగే ధర్నాను జయ ప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు అన్నారు. గురువారం మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ముఠా కార్మికులతో కలిసి ధర్నా గోడపత్రికలను ఆంజనేయరాజు ఆవిష్కరించారు. అర్హులైన పేదలందరికీ పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇండ్ల స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెలగల నాని, మట్ట రామకృష్ణ, ముప్పిడి ఏసు, అయినపర్తి మహేష్, వెలగల రామా రావు, పుల పాకుల రాంబాబు, మల్లిపూడి చిన్నగోపాలం, శివ,తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు లేక ప్రజల అవస్థలు

విశాలాంధ్ర - ముదినేపల్లి : ముదినేపల్లి మండలంలో ఆధార్ కేంద్రాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉన్నవాటిలో రెండు కేంద్రాలు పని చేయడం లేదు. ఇటీవల ప్రభుత్వం ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసుకునేందుకు వ్రాత పరీక్ష నిర్వహించగా నలుగురు అర్హత సాధించారు. వారికి ఐడి కేటాయిస్తే వెంటనే గ్రామ సచివాలయంలో నిర్వాహణ చేపట్టవచ్చు. మండలంలో ఆధార్ నమోదు కోసం గుడివాడ ఇతర ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తుందని సాంకేతిక కారణాలతో రోజులు పడుతున్నా నమోదు కావడం లేదని వెంటనే ముదినేపల్లిలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బిఎఎస్ఎఫ్ నుంచి వాలెక్సియో, మిబెల్యా ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఏలూరు: బిఎఎస్ఎఫ్ ఇండియా తన ఆధునిక విశ్వ పంట రక్షణ పరిష్కారాల్లో రెండు రకాలు అయిన వాలెక్సియో (ఆర్) కీటకనాశినిని మరియు మిబెల్యా (ఆర్) శిలీంద్రనాశినిని ప్రారంభించింది. భారతదేశంలో అత్యంత ముఖ్య ఆహార పంట అయిన వరి పంటకు ఇవి సేవలందిస్తాయి. ఈ రెండు వినూత్న పరిష్కారాలను ప్రవేశపెట్టడం భారతదేశపు జాతీయ ఆహార భద్రత ఎజెండాకు సహాయపడుతుంది. వరి పంటకు తీవ్ర నష్టం కలిగించే కీటకాలైన దోమ పోటును అదుపుచేయడం మరియు పొడ తెగులు లాంటి తెగుళ్ళను నియంత్రించడం ద్వారా వరి రైతులు తమ పంట దిగుబడులను పెంచుకోవడానికి ఈ పరిష్కారాలు సహాయపడతాయి. వార్షిక పంట ఉత్పత్తి 100 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా ఉండటంతో, ప్రపంచంలో వరి పండించే దేశాల్లో భారతదేశం రెండవ స్థానంలో ఉంది, ప్రపంచవ్యాప్తంగా వరి ట్రేడ్‌లో దాదాపు 40 శాతానికి దోహదపడుతోంది. వాతావరణ మార్పు ప్రభావం భారతదేశంలో వరి రైతులను బాగా ప్రభావితం చేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల కరువు, తెగుళ్ళు, దోమ పోటు విస్తరణ వల్ల దిగుబడులు అల్పంగా మరియు నాణ్యత తక్కువగా ఉంటాయి. "వాలెక్సియో అనేది బిఎఎస్ఎఫ్ యొక్క ఆధునిక కీటకనాశిని మరియు ఆసియా పసిఫిక్‌లోని వరి రైతులకు మాత్రమే కాకుండా, ఈ ప్రాంతంలోని వరి పంట వ్యవస్థకు మా దీర్ఘకాలిక నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తోంది. మేము దీనిని మొట్టమొదటగా భారతదేశంలో ప్రారంభిస్తున్నందుకు చాలా ఉత్సాహంగా ఉన్నాము. వరి రైతులకు వాళ్ళ పొలాల్లో కీటకాలను అదుపు చేసేందుకు సహాయపడే కొత్త కెమిస్ట్రీ అవసరమనే విషయం మేము తెలుసుకున్నాము కాబట్టి మొట్టమొదటగా భారతదేశంలో ప్రారంభించాము" అన్నారు మార్కో గ్రోజ్‌డనోవిక్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ స్ట్రాటజిక్ మార్కెటింగ్ అండ్ సస్టైనబిలిటీ, బిఎఎస్ఎఫ్ అగ్రికల్చరల్ సొల్యూషన్స్. "క్రియాశీల పదార్థంలో మార్కెట్ ప్రమాణాలకు తెలిసిన క్రాస్-రెసిస్టెన్స్ లేదు. నాలుగు రకాల వరి దోమ పోట్ల యొక్క జీవిత దశలన్నిటిపై అద్భుతమైన పనితీరు చూపిస్తుంది మరియు అవశేషాలను సుదీర్ఘ కాలం నియంత్రిస్తుంది." మొక్కకు సర్వోత్తమ ఆరోగ్య ప్రయోజనాలను కల్పించడం ద్వారా వరి మొక్కలను వెలెక్సియో బలపరుస్తుందని కూడా నిర్వహించబడిన అధ్యయనాలు ప్రదర్శించాయని చెప్పారు.

సంకు అప్పారావు ఆశయాలను అనుసరించాలి

విశాలాంధ్ర-ఇరగవరం: సంకు అప్పారావు ఆశయాలను మనందరం అనుసరించాలని సామాజికవేత్త సంకు మనోరమ పేర్కొన్నారు.

ఇరగవరం మండలం తూర్పు విప్పర్రు సంకు అప్పారావు భవనం సిపిఐ కార్యాలయంలో సంకు అప్పారావు 33వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. సంకు అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ లెక్చరర్, సామాజిక వేత్త సంకు మనోరమ మాట్లాడుతూ రైతు నాయకులు, స్వాతంత్ర సమరయోధులు అప్పారావు అనేక పోరాటాలలో పాల్గొని,రైతు సంఘం,సిపిఐకి అనేక సేవలు అందించారన్నారు. సిపిఐ మండల కార్యదర్శి నామన వెంకటేశ్వరరావు,గ్రామ కార్యదర్శి అద్దాల సత్యనారాయణ, ప్రజా నాట్యమండలి కళాకారులు, గిద్ద సూర్య నారాయణ తదితరుల ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కుడిపూడి వెంకటరెడ్డి, కాటూరి రాముడు, చిక్కాల బ్రహ్మాజీ, గుడిమెట్ల కోటేశ్వరరావు, బొరుసు యేసు, తిరుమల శెట్టి చంటి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మానవతా విలువలు పెంపు

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : రక్తదానం చేయడం ద్వారా దాతల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందని, యువతలో మానవతా విలువలు

పెరుగుతాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం మండలం రాయలంలో జనసేన పట్టణ కార్యదర్శి పత్తి హరివర్ధన్ అధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ఎమ్మెల్యే అంజిబాబు పుట్టినరోజును పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు ప్రారంభించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని తద్వారా ప్రాణదాతలు కావాలని అన్నారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మాట్లాడుతూ ప్రతిరోజూ రక్తం అవసరం ఉండి ఎంతోమంది ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారు రక్తం కోసం పాట్లు పడుతున్నారని, రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. అనంతరం 125 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్స్ అందించారు. కార్యక్రమంలో రాయలం జనసేన నాయకులు, గ్రామస్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధి (1వ పేజీ తరువాయి)

నాబార్డు నిధులు రూ.7.37 కోట్లతో రోడ్ల అభివృద్ధి మండలంలోని సింగరం నుండి నందమూరు అక్విడేట్ వరకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా రహదారుల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఏడు నియోజక వర్గాల పరిధిలో రహదారుల అభివృద్ధి నిమిత్తం నాబార్డు ద్వారా 38.61 కిలో మీటర్ల మేర 13 రహదారుల నిర్మాణం, మరమ్మత్తులు చేపట్టేందుకు రూ.24.62 కోట్ల అంచనాతో నిధులు మంజూరు కాగా కేవలం నిడదవోలు నియోజకవర్గంలో 4 రోడ్లకు ఈ మేర నిధులు రావడంలో మంత్రి దుర్గేష్ తీవ్రంగా కృషి చేశారు. ఆయా రహదారుల దుస్థితిని స్వయంగా గమనించిన మంత్రి దుర్గేష్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి తద్వారా రోడ్డు పనులకు నిధులు విడుదల చేయించడంలో తనదైన మార్క్ చూపారు. నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రహదారులను బాగుచేసే దిశగా కృషి చేస్తున్నారు. నాబార్డు నిధులు మంజూరైన వెంటనే విషయాన్ని ప్రజలకు తెలుపుతూ రహదారులు అభివృద్ధికి చిహ్నాలని మంత్రి దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల తరపున ప్రభుత్వానికి మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు.

సంకు అప్పారావు, సోం బసవరాజు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-ఏలూరు: స్వాతంత్ర సమరయోధులు, సీపీఐ సీనియర్ నాయకులు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు సంకు అప్పారావు, స్వాతంత్ర సమర యోధులు, చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు కనకం సోం బసవరాజు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని పార్టీ నిర్మాణానికి, ప్రజాసంఘాల అభివృద్ధికి సీపీఐ కార్యకర్తలు పని చేయాలని రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వర రావు పిలుపు నిచ్చారు. ఏలూరు 36వ డివిజన్ కనకంవారి వీధిలో గురువారం సంకు అప్పారావు, కనకం సోం బసవరాజు వర్ధంతి సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. సంకు అప్పారావు విగ్రహానికి బండి వెంకటేశ్వరరావు, కనకం సోం బసవరాజు చిత్రపటా నికి చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సిపిఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురేళ్ల వరప్రసాద్ అధ్యక్షత వహించారు. బండి వెంకటేశ్వరరావు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్, కడుపు కన్నయ్య మాట్లాడుతూ సంకు అప్పారావు, కనకం సోంబసవరాజు జిల్లాలో రాష్ట్రంలో సమస్యల పైన ప్రజా సమస్యల పైన చేనేత కార్మికుల సమస్యల పైన పనిచేశారని, వారి ఉద్యమ స్ఫూర్తితో ఏలూరు జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ,చేనేత కార్మిక సంఘం అభివృద్ధికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, సిపిఐ నాయకులు గేదెల నాగేశ్వరరావు, యర్రా వెంకటేశ్వర్లు, కనకం జగన్, బేతా శంకర్, ఏఐటీయూసీ నాయకులు పోలా భాస్కరరావు, జాద గుర్నాథ్, సోం బసవరాజు తనయుడు కనకం గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

విశాలాంధ్ర -ఉండి : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మహాదేవపట్నం గ్రామంలో అర్హులైన పేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ దరఖాస్తులను పూర్తిచేసే కార్యక్రమం సీపీఐ ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. ఇళ్ల స్థలాలు లేని వారు వందలాదిగా ఉన్నట్లు వారు గుర్తించారు. ఈ సందర్భంగా కార్యదర్శి వెంకట్రావు మాట్లాడుతూ పేదలు ఇంటి స్థలాలు లేక అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గూడు, నీడ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని అటకెక్కించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు సూపర్ సిక్స్ పథకాలు తక్షణ అమలు చేయాలని లేని పక్షంలో సిపిఐ

ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. జూన్ రెండో తేదీన ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ మండల కార్యాలయం వద్ద జరిగే ధర్నా విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సనపల శ్రీనివాస్, మహాదేవపట్నం శాఖ కార్యదర్శి కోన గొల్లయ్య, పేదలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర -భీమవరం : జిల్లాలోని స్కావెంజర్స్ కాలనీలను గుర్తించి అర్హులైన లబ్ధిదారులకు ప్రథమ ప్రాధాన్యతగా ఇళ్ల స్థలాల మంజూరుకు చర్యలు తీసుకోవాల్సిందిగా గృహ నిర్మాణ శాఖ అధికారిని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన మ్యాన్యువల్ స్కావెంజర్ నిషేధ, పునరావాస చట్టంకు సంబంధించిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సభ్యులు జయ రామకృష్ణ, బొత్స లక్ష్మీ దుర్గ, జిల్లెల సత్య సుధామ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మ్యాన్యువల్ స్కాంజర్ కుటుంబ సభ్యులకు మెరుగైన అవకాశాలను కల్పించే దిశగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్ లేరని, గతంలో స్కావెంజర్స్‌గా పనిచేసిన కుటుంబాల పిల్లలకు అవసరమైన ఉపాధి అవకాశాలకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఆయా కుటుంబాల్లో ఎవరైనా చదువుకున్న వారు ఉంటే జాబ్ మేళాల ద్వారా తగిన ఉద్యోగాలు అందించనున్నట్లు తెలిపారు. . సభ్యులు జయ రామకృష్ణ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం బైపాస్ ఏర్పాటులో కొంతమంది స్కావెంజర్స్ కుటుంబాలు ఇళ్లను కోల్పోయారని, 20 ఫ్యామిలీలు బైపాస్ పక్కన నివసిస్తున్నారని వారందరికీ ఇళ్ల స్థలాలను ఇప్పించవలసిందిగా కోరారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో స్కావెంజర్స్ కాలనీలు ఎక్కడ ఉన్నా గుర్తించి అర్హులైన లబ్ధిదారులకు అత్యంత ప్రాధాన్యతగా ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో డి ఎస్ డబ్ల్యు ఓ బి వి ఎస్ బి రామాంజనేయ రాజు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్ప రాణి, భీమవరం మున్సిపల్ కమిషనర్ కే రామచంద్రారెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి. పిచ్చయ్య, డి ఎల్ డి ఓ వై దోస్ రెడ్డి, డ్వామా పిడి డాక్టర్ కే సిహెచ్ అప్పారావు, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు జయరామకృష్ణ, బొత్స లక్ష్మీ దుర్గ, జిల్లెల్ల సత్య సుధామ, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, ఆకివీడు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నూజివీడులో నేడు మెగా జాబ్‌మేళా

విశాలాంధ్ర-నూజివీడు : రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ నూజివీడులో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఈమేరకు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి కార్యాలయం గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఈనెల 30వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి నూజివీడు ఎస్ఆర్ఆర్ జెడ్పి బాలుర హైస్కూల్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేళాకు 13 కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు హాజరై 1095 అర్హతగల ఎస్ఎస్ సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బిఫార్మసీ, బిటెక్, తదితర కోర్సులు పూర్తిచేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయన్నారు. అర్హత గల అభ్యర్ధులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ముందుగా ఆన్ లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, తప్పనిసరిగా ఫార్మల్ డ్రెస్‌లో రెస్యూమ్ తీసుకొని రావాలని సూచించారు.

మానసిక ప్రశాంతతకు యోగ అవసరం

విశాలాంధ్ర -ఉండి : మనిషి ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో అవసరమని

ఇన్‌చార్జి ఎంపిడిఓ చల్లా సుదర్శన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కోలమూరు, పెద్దపుల్లేరు, ఎన్నార్పి అగ్రహారం, ఎండగండి, చెరుకువాడ, అర్తమూరు, ఉండి, వాండ్రం మహాదేవపట్నం గ్రామాలలో యోగాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్న పెద్ద పిల్ల పాప అని తేడా లేకుండా పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ భంగిమలతో యోగ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుదర్శన్ రెడ్డి ఆయా గ్రామాల కార్యదర్శులు జేవిటి నాయుడు గోపాలకృష్ణ శివాజీ జమాల్ మాట్లాడుతూ యోగా చేయటం వల్ల మనిషి ఆరోగ్యానికి మానసిక ప్రశాంతతకు శారీరక ఉల్లాసానికి ఎంతో మేలు జరుగుతుంద న్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. మనిషి ప్రశాంత జీవనానికి యోగ అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

యోగతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర- ఉంగుటూరు : యోగా చేయటం వలన సంపూర్ణ ఆరోగ్యం దరి చేరుతుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు.

గురువారం ఉంగుటూరు గ్రామపంచాయతీ కమ్యూనిటీ హాల్‌లో యోగా శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి బందారు సింధు మధుబాబు సభకు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగా చేయాలన్నారు. తహశీల్దార్ రవికుమార్, ఎంపీడీవో జీఆర్ మనోజ్, కార్యదర్శి బొడ్డు వెంకట రవిచంద్రకుమార్, వంగ రఘు, పంది రాంబాబు, యోగా మాస్టర్లు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను డీఎస్పీ పరిశీలన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరం పాలెం ఆదిత్య యూనివర్సి టీలో ఏపీ పోలీస్ కాని స్టేబుల్ మెయిన్స్ పరీక్ష చివరి రాత పరీక్ష జూన్ 1, 2025 (ఆదివారం) ఉదయం 10.గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు జరగనుంది. ఈ సందర్భంగా ఆదిత్య యూనివర్సిటీలో నిర్వహించబడే ఎగ్జామ్ సెంటర్లను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జగ్గంపేట సీఐ గండేపల్లి ఎస్ఐ ఉన్నారు. ఆదిత్యలో ఎగ్జామ్స్‌కు సంబం ధించిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు యూనివర్సిటీ ప్రోవైస్‌చాన్సలర్, ఎగ్జామ్స్ కో ఆర్డినేటర్ డా ఆదిరెడ్డి రమేష్ వివరించారు.

కూటమి ప్రభుత్వానికి, మంత్రి దుర్గేష్‌కు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - నిడదవోలు : రేషన్‌షాపు డీలర్ల ద్వారానే రేషన్ పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టిన కూటమి ప్రభు త్వానికి, రాష్ట్ర మంత్రి దుర్గేష్‌కు నిడదవోలు రేషన్ షాపు డీలర్ల సంఘం కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం ఎండియు వాహనం ద్వారా రేషన్‌ను పంపిణీ చేసి డీలర్లను ఇబ్బందికి గురి చేసిం దని వాపోయారు. రేషన్ షాపు డీలర్ల ద్వారానే రేషన్ పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టి ఎండియు వ్యవస్థను రద్దుపరిచిన కూటమి ప్రభుత్వానికి, అందుకు ఆమోదం తెలిపిన మంత్రి కందుల దుర్గేష్‌కు రేషన్ డీలర్లు ధన్యవాదాలు తెలిపారు. స్థానిక మంత్రి కార్యాలయంలో ఈ మేరకు మంత్రి దుర్గేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రేషన్ వాహనాల రద్దును ఆహ్వానిస్తున్నామని దుర్గేష్‌కు తెలిపారు. చౌక ధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సానుకూల ంగా స్వీకరిస్తున్నామన్నారు. డీలర్ల వ్యవస్థపై నమ్మకం ఉంచినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నిడదవోలు, మండల రేషన్ షాప్ డీలర్స్ పాల్గొన్నారు.

జాతీయ ఉపాధ్యాయ మెంటార్‌గా సుబ్బరాజు



విశాలాంధ్ర-కాకినాడ : దేశవ్యాప్తంగా సుమారు కోటిమంది ఉపాధ్యా యులకు విద్యాబోధన నైపుణ్యాలలో తర్ఫీదునిచ్చే మెంటార్‌గా విశ్రాంత ఉపాధ్యాయుడు పత్సమట్ల సుబ్బరాజు నియమితు లయ్యారు. 2020 జాతీయ విద్యా విధానాన్నను సరించి జాతీయ ఉపాధ్యాయ శిక్షణా మండలి ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ మెంటారింగ్ మిషన్ ఏర్పాటైంది. దేశవ్యాప్తంగా వివిధరంగాల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులకు తర్ఫీదు నివ్వడం ఈ మిషన్ ముఖ్య ఉద్దేశం. జాతీయ స్థాయిలో ఉపాధ్యాయుల మానసిక ఆరోగ్యం, భాషా నైపుణ్యాలు, ప్రాథమిక గణిత సామర్థ్యాలు వంటి పలు అంశాల్లో సుబ్బరాజు శిక్షణనిస్తారు. పదవీవిరమణ అనం తరం కూడా 'సుబ్బరాజూస్ లెర్నింగ్ హబ్' అనే యూ ట్యూబ్ ఛానల్ ద్వారా ఇంగ్లీషు, గణితం, భూగోళశాస్త్రం వంటి అంశాల్లో విద్యార్థు లకు, ఉపాధ్యాయులకు, డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ కార్యక్రమాలు కొన సాగిస్తున్నారు. వివిధ పాఠశాలలు, కళాశాలలు సందర్శించి విద్యార్థు లకు, ఉపాధ్యాయులకు మోటివేషన్ తరగతులు నిర్వహి స్తున్నారు. సుబ్బరాజు నియామకంపై పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు జి నాగమణి, డివైఇఒ వెంకటేశ్వరరావులు అభినందనలు తెలియజేశారు.

యోగ, ప్రణాయామ ప్రక్రియలలో శిక్షణ

విశాలాంధ్ర - కాకినాడ : అంతర్జాతీయ యోగ దినో త్సవం-2025 పురస్కరించి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగ ఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కలెక్టర్, కాకినాడ వారి సూచనల మేరకు సమాచార పౌర సంబంధ శాఖ జిల్లా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుండి 31వ తేదీ వరకూ స్థానిక రాజాటాంక్ ఆవరణలో జిల్లా రెడ్ క్రాస్ యోగా కేంద్రంలో ఉదయం 7-30 గంటల నుండి 8-30 గంటల వరకూ కాకినాడ జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు వారం రోజులు యోగ, ప్రణాయామ ప్రక్రియలలో శిక్షణ కార్యక్రమం నాల్గోవ రోజు ఆయుష్ యోగ గురు రామా పల్లవి శిక్షణలో నాల్గోవ రోజు విజయవంతంగా పూర్తి చేశారు.

రైతులతో యోగాంధ్ర

- జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : యోగాంధ్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం ఆర్ట్స్ కళాశాల మైదానం సమీపంలో గ్రాండ్ ట్రంకు రోడ్డుపై ప్రాధాన్యత రంగం శాఖల ఆధ్వర్యంలో రైతు లతో, నగర ప్రజలు, మహిళలతో యోగసాధన కార్య క్రమం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలె క్టర్, జిల్లా నోడల్ అధికారి ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శ కాలను అనుసరించి వ్యవసాయశాఖ ఆధ్వ ర్యంలో "రైతులు" అనే ఇతివృత్తంతో కార్యక్రమంలో నిర్వహి ంచడం జరిగిందన్నారు. యోగా సాధనను ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు, యోగా గురువు శివ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.సూక్ష్మ వ్యాయా మం, తాడాసనం, వృక్షాసనం, పాదహస్తా సనం, అర్ధ చక్రాసనం, త్రికోణాసనం వంటి వివిధ ఆసనాలతో పాటు కపాల భాతి క్రియ, అనులోమ, విలోమ ప్రాణా యామం మొదలైన యోగ ప్రక్రియలను సాధన చేయి ంచారు. బ్రహ్మకుమారి సోదరి బి.కే. శ్రావణి రాజ యోగ ధ్యానాన్ని (మెడిటేషన్) చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంయుక్త కలెక్టర్ జి.చిన్న రాముడు మాట్లాడుతూ యోగా కార్యక్రమా లలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, వారితో పాటుగా వారి కుటుంబ సభ్యులను కూడా తీసుకు రావాలని కోరారు. యోగా ద్వారా ఆరోగ్య సమస్యలుతగ్గుతాయన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మందితో యోగాసాధన చేయాలన్న లక్ష్యాన్ని చేరుకో వాలంటే ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకొని, నిత్యం యోగసాధన చేయాలని కోరారు. జూన్ 1 ఆదివారం సరస్వతి ఘాట్ వద్ద, జూన్ 7 శని వారం సత్యదేవ నర్సరీ, కడియం, కడియం మండలం, జూన్ 14న శని వారం కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో, జూన్ 20 శుక్ర వారం నగరవనం పర్యటక ప్రదేశాల్లో యోగా అభ్యా సం సాధన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుం దని తెలియచేశారు. వై జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్ళి అక్కడ రైతులు,అధికారులతో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో మానవహారంగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమ ంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ తాతారావు, జిల్లా సూక్ష్మ సేద్యాధికారి ఏ దుర్గేష్, జిల్లా ఆయుష్ అధికారి కె.రమేష్, యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి డాక్టర్ పి.కాజియా, యోగా శిక్షకులు కేవీ సుబ్రమణ్యం, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

యోగతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - రాజానగరం : యోగతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి జె.ఏ.ఝాన్సీ రాణి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగ కార్యక్రమాలను సందర్భంగా, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్క రించుకొని మండల కేంద్రమైన రాజా నగరం లోని శ్రీ రాజా కాండ్రేగుల జోగి జగన్నాథం పంతులు బహదూర్ వారి అన్నదాన సత్రం నందు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా యోగా శిక్షకులు మట్టా వీర వెంకటరమణ అందించగా వివిధ శాఖల మండల అధికారులు, సిబ్బంది యోగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎంపిడివో ఝాన్సీరాణి, పి. హెచ్.సి మెడికల్ ఆఫీసర్ రామ భాస్కరరావు మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతను వివరించారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రతి ఒక్కరికి విస్తృత ప్రచారము కల్పించాలని సూచించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు మండలంలో ప్రతిఒక్కరు విజయవంతం చెయ్యాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.అనంత లక్ష్మీ సత్యవతి దేవి, ఎంపిడివో కార్యాలయం పరిపాలనాధికారి ఎం.సుబ్రహ్మణ్యం, ఐసిడిఎస్ సిబ్బంది, వెలుగు సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఫ్రీ విద్య కొరకు 56 మంది విద్యార్థులకు అర్హత

విశాలాంధ్ర - కరప : విద్య హక్కు చట్ట ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25% ఫ్రీ సీట్లు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో కరప మండలంలో 15 ప్రైవేట్ స్కూళ్లలో 56 మంది విద్యార్థులకు ఒకటవ తరగతి ప్రవేశం కోసం సీట్లు కేటాయింపు జరిగిందని ఎంఈఓ2 పి సత్యనారాయణ విలేకరులకు తెలిపారు. విద్యా ర్థులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

రేషన్ షాపులు తహసీల్దార్ తనిఖీ

విశాలాంధ్ర - పెదపూడి : మండలంలో 42 రేషన్ షాపులను తహసీల్దార్ పీవీ సీతాపతిరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి రేషన్ షాపుల నుంచి రేషన్ కార్డు లబ్దిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయనున్ననేపథ్యంలో ఉన్నత అధికారుల ఆదేశాలమేరకు రేషన్ షాపులు పరిశీలించామన్నారు. షాపుల వద్ద ఈ పోసు మిషన్లు, వేయింగ్ మిషన్లు ఏలా పనిచేస్తున్నాయో పరిశీలించామన్నారు. షాపుల లైసెన్స్ వేలిడిటీ ఎంతవరకు ఉంది, స్టాక్ రూమ్ ఏర్పాటుకు గదులు ఉన్నాయోలేదో పరిశీలించామన్నారు. అలాగే స్మార్ట్ మార్కెట్ ఏర్పాటుకు డీలర్ అంగీకారమా లేదా అని డీలర్లు అడిగితెలుసుకున్నామ న్నారు. అందరు అంగీకరించినట్లు తెలిపారు. షాపుల వద్ద షాపు నంబర్తోపాటు సరు కులు, వాటి ధరలు తెలిపే ప్రదర్శన బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహీల్దార్ గోవిందు తదితరులు ఉన్నారు.

జూన్ 5న విజయవాడలో రాష్ట్ర కౌన్సిల్‌ను జయప్రదం చేయండి : ఏపీజీఇ

విశాలాంధ్ర-కడియం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఇఎ) రాష్ట్ర మూడవ కౌన్సిల్ సభలు జూన్ 5 న విజయవాడలో జరగనున్నాయని, ఈ సభలను జయప్రదం చేయడం ద్వారా ఉద్యోగుల ఐక్యతను చాటి చెప్పా లని ఏపీజీఇఎ తూర్పు గోదావరి జిల్లా శాఖ అధ్యక్షులు పి. గిరిప్రసాద్ వర్మ పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం, ఏపీజీఇఎ జిల్లా నాయకుల బృందం పి గిరి ప్రసాద్ వర్మ నాయకత్వంలో రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ల లోని ఉద్యోగులను రాష్ట్ర కౌన్సిల్ సభలకు ఆహ్వానించారు. ఈ పర్యటనలో పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షులు పి రవికుమార్ రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఆవరణలో మాట్లాడుతూ, రాష్ట్ర ఏపీజీఇఎ 3వ కౌన్సిల్ సభలు కెఆర్ సూర్యనారాయణ అధ్యక్షతన జూన్ 5న విజయవాడలో జరుగు తాయని తెలిపారు. ఈ సభలో రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వంటి ప్రముఖులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. రాజమహేంద్రవరం నగరఅధ్యక్షులు జీబీ విజయకుమార్ మాట్లా డుతూ, తక్షణమే 12 వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని ఏపీజీఇఎ కోరు తోందని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు రాష్ట్ర కౌన్సిల్‌ను జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షులు కె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఏ ప్రభుత్వ ఉద్యోగికి అన్యాయం జరగకుండా ఏపీజీఇఎ శక్తి వంచన లేకుండా కాపాడుతుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ సభల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం, సీపీఎస్ రద్దు వంటి డిమా ండ్ల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, కొవ్వూరు ఏరియా హాస్పిటల్ ఉద్యోగులతో పోస్టర్లు ఆవిష్కరించి, ఉద్యోగులను సభలకు ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దినేష్, టౌన్ నాయకులు రెహ్మాన్, నాగేశ్వరావు, భద్ర, ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాయితీపై పశు దాణా పంపిణీ



విశాలాంధ్ర - ఆలమూరు : మండల కేంద్రమైన ఆలమూరులో పశు వైద్య శాల నందు గురువారం పశుసం వర్ధక శాఖ ఏడి డాక్టర్ ఎల్ అనిత ఆధ్వర్యంలో రాయితీపై పశు దాణా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు 50% రాయితీతో పశువుల దాణాను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం ప్రోటీన్ కలిగిన ఈ దాణాను తొలి సారిగా అందిస్తున్నారని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు రాయితీపై దాణా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. నాణ్యమైన దాణా అందించడం వల్ల పాడి పశువులకు ఆరోగ్యంతో పాటు పాల ఉత్పత్తి కూడా పెరుగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కూటమి నాయకులు ఈదల రాంబాబు, ఒంటిపల్లి సతీష్, నల్ల బాబు, రామా సుజుల శేషగిరిరావు, కేతరాంబాబు, మాజీ ఎంపిటిసి గంగుల నాగజ్యోతి పాల్గొన్నారు.

శిథిలావస్థలో సూర్యారావుపేట కాలువ వంతెన

- ఓఎన్జిసి కార్యకలాపాలలే కారణం
- పట్టించుకోని ఆ శాఖ అధికారులు

విశాలాంధ్ర-ఆలమూరు : మండలంలోని చింతలూరు నుండి సూర్యారావుపేట వెళ్లే ఆర్ అండ్ బి రహదారిలో ఉన్న ప్రధాన కాలువ పై నిర్మించి ఉన్న వంతెన ఇటీవల ఓఎన్జిసి కార్యకలాపాలతో శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 1000 మంది ఓటర్లు ఉన్న ఈ గ్రామానికి ఇదే ప్రధాన రహదారి ఉంది. ఈ మార్గం ద్వారానే నిత్యం గ్రామస్తులంతా ప్రయాణిస్తూ వారి పనులు ముగించుకొంటూ ఉంటారు. ఓఎన్జిసి కార్యకలాపాలకు శిథిలావస్థకు చేరిన ఆ వంతెన మీదుగా ప్రయాణం సాగించాలంటే వారంతా భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై ఆ గ్రామస్తులు ఓఎన్జిసికి పలుమార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని వారు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి ఆ వంతెనను వెంటనే పునర్నిర్మించాలని గ్రామస్తులు ముక్తకంఠంగా కోరుచున్నారు. నిత్యం ఏదో ఒక సమయంలో ఓఎన్జిసికి చెందిన భారీ వాహనాలు తమ రిగ్గు వద్దకు వెళ్లి రావడం జరుగుతూనే ఉండడంతో వంతెన ఎప్పుడు కూలిపోతుం దోనన్న భయాందోళనకు గ్రామస్తులు గురవుతున్నారు. ఇకనైనా ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి వంతెనను వేగవంతంగా నిర్మించి అందజేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే గ్రామానికి చెందిన కాల జయరాజు,కాలా ప్రసాద్ మాట్లాడుతూ ఓఎన్జిసి భారీ వాహనాలు నిత్యం ఈ వంతెనపై ప్రయాణిస్తున్నాయని, దీనితో వంతెన శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి మా గ్రామానికి వెళ్లే రహదారిని, వంతెనను నూతనంగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రైతులను శక్తివంతులుగా ఎదిగేందుకు దోహదం

- వికసిత కృషి సంకల్ప్ అభియాన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాజానగరం, సీతానగరం : రైతులను శక్తివంతులుగా తయారు చేస్తూ వారి జీవనోపాధిని మెరుగుపరచడానికి వికసిత కృషి సంకల్ప్ అభియాన్ దోహద పడుతుందని నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామ కృష్ణ అన్నారు. నియోజవర్గంలోని కోరుకొండ ఎంపిడివో కార్యాలయం నందు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ కృషి విజ్ఞాన కేంద్రం కలవచర్ల ఆధ్వర్యంలో గురువారం జరిగిన జిల్లా వికసిత కృషి సంకల్ప్ అభియాన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ప్రారంభమైన వికసిత కృషి సంకల్ప్ అభియాన్ రైతులు జాతికే గర్వకారణమని కొనియాడారు. వ్యవసాయ రంగంలో రానున్న రోజుల్లో పెను మార్పులు వస్తాయని చెప్పారు. వ్యవసాయం మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల29 నుండి జూన్ 12వ తేదీ వరకు దేశవ్యాప్తంగా వ్యవసాయ శాఖ, కెవికె, ఐసిఏఆర్ పరిశోధనా సంస్థల ద్వారా దేశ వ్యాప్తంగా ప్రీ-ఖరీఫ్ ప్రచా రం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.అనంతరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను ఆయా శాఖల అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కెవికె ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.ఎస్.జి.ఆర్.నాయుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు రైతులు పాల్గొన్నారు.

మీడియా కథనాల పై విచారణ జరిపిస్తా

విశాలాంధ్ర- తాళ్లపూడి : తాళ్లపూడి మండలం తాడిపూడి లో ఇసుక రీచ్ ల నుండి ఇసుక అమ్మకాలు కంటే ఏలూరు జిల్లా స్టాక్ పాయింట్ కి ఇసుక తరలించే కార్యక్రమం ఎక్కువగా జరుగుతోందని, ఓ మీడియా లో వచ్చిన కథనం లో నిజం లేదని, అధిక రేట్లు అమ్మినట్లు ఫిర్యాదులు ఎవరు ఇచ్చినా విచారణ జరుపుతామని కొవ్వూరు ఆర్డీఓ రాణి సుష్మిత పేర్కొన్నారు. తాళ్లపూడి మండలం తాడిపూడి ఇసుక రీచ్ లలో కొవ్వూరు ఆర్డీఓ గురువారం తనిఖీ నిర్వహించారు. ఏలూరు జిల్లా స్టాక్ పాయింట్ కు తరలించేందుకు ప్రభుత్వం సెమి మేకనైజ్డ్ బోయేట్లు వినియోగించే అవకాశం కలిగించిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఇక్కడ జియో కోఆర్డినేట్ ఏర్పాటు చేయటం నాలుగు రోజులు లేట్ అయ్యిందని, జిల్లా మైనింగ్ నుండి అభ్యంతరం లేదని చెప్పాక స్టాక్ పాయింటికి పంపుతున్నారని, తాడిపూడి ఇసుక రీచ్ లల్లో అమ్మకాలు కంటే ఏలూరు స్టాక్ పాయింట్ కి నిర్ణయించిన టార్గెట్ మేరకు ఇసుక తరలింపు జరుగు తోందని అన్నారు. ఈ నెలాఖరు లోపు లక్ష క్యూబిక్ మీటర్ల ఇసుక స్టాక్ ఉంచాల్సి ఉందన్నారు. ఇసుక 15వేల రూపాయల వరకు అమ్ముతున్నారన్న మీడియా కథనం తప్పని, అలా వసూళ్లు చేస్తే తమ దృష్టికి తీసుకు రావచ్చని, సీరియస్ ఏక్షన్ వుంటుం దన్నారు. గతం లో కూడా తాళ్లపూడి నుండి మరో కొన్ని మీడియాల్లో వచ్చిన ఇసుక రవాణా లో ప్రాణాలు పోతున్నాయని కథనాలు పట్ల కూడా స్పందించారు. గతంలో జరిగిన సంఘటనలను కొత్తగా జరిగినట్లు మీడియాలో రావటం పట్ల స్పందించారు. మీడియాలో వాస్తవా లను వ్రాయాలని, ఆ కథనాలతో అక్రమాలను అరికట్టేందుకు వీలు పడుతుందని ఆమె మీడియా ను సున్నితంగా హెచ్చరిం చారు. ఆర్డీఓ వెంట తసీల్దార్ భారతి, ఎస్సై రామకృష్ణ, మైనింగ్, టాస్క్ ఫోర్స్ అధికారులున్నారు.

జూన్ 3న రామచంద్రపురంలో జాబ్ మేళా

ప్రముఖ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు : మంత్రి సుభాష్

విశాలాంధ్ర - రామచంద్రపురం : నిరుద్యోగ సమస్య నిర్మూలనలో భాగంగా రామచంద్రపురంలోని ఉపాధి భవన్‌లో జూన్ 3న, ఉదయం 9:30 గంటలకు ప్రముఖ కంపెనీలైన కోజెంట్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, మెక్వన్, బెర్గెన్ పైప్ సపోర్ట్ కంపెనీలతో జాబ్ మేళాలి నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్, ఉపాధి భవన్ సంయుక్త ఆధ్వర్యంలో వారం వారం నిర్వహించే జాబ్ మేళాలో భాగంగా మంగళూరుకు చెందిన కోజెంట్ కంపెనీలో ఇంటర్, ఆపై చదివి కంప్యూటర్ పరిజ్ఞానము కలిగిన 18 నుండి 45 సంవత్సరాల అభ్యర్థులకు రూ.16వేలు జీతం, ఇన్సెంటివ్స్‌తో ఇన్ బౌండ్, అవుట్ బౌండ్ వాయిస్ ప్రాసెస్ ఉద్యోగాల కోసం ఇంట ర్వ్యూ నిర్వహిస్తారు. అలాగే తునికు చెందిన డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బి జెడ్ సి, బిఎస్‌సి కెమిస్ట్రీ, డిప్లొమా, బిటెక్ మెకానికల్ చదివిన 18 నుండి 27 సంవత్సరాల పురుష అభ్యర్థులకు రూ. 19,477/- సీటీసీ జీతంతో ట్రైనీ కెమిస్ట్/ ట్రైనీ విభాగంలో ఉద్యోగాల కొరకు. శ్రీసిటీ, తడలో గల మెక్వన్, బెర్గెన్ పైప్ సపోర్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో పదవ తరగతి ఆపై చదివిన 18 నుండి 35 సంవత్సరాల అభ్యర్థులకు సుమారు రూ. 15వేలు నుండి 17వేలు జీతంతో ప్రొడక్షన్-హెల్పర్ ఉద్యోగముల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ సత్యం, ఉపాధి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాంకుమార్ తెలిపారు. మరిన్ని వివరములు కోసం చరవాణి నెంబర్ 9515481671లో సంప్రదించాలని కోరారు.

రిపోర్టర్ మురళీ కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : సీనియర్ రిపోర్టర్ మురళి తండ్రి రెడ్డం చిన్న గోవిందు ఇటీవల కాలంలో మృతి చెందడంతో మురళి కుటుంబాన్ని వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. గోవిందు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మురళి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ రామిశెట్టి నాని, వైసిపి ఎస్సీ సెల్ నియోజవర్గ అధ్యక్షులు గుడాల వెంకటరత్నం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, జాతీయఫోటోగ్రఫీ అవార్డుగ్రహీత, సలాది కృష్ణ, దొరబాబు పాల్గొన్నారు.

"ధ్యానోత్సవం" కరపత్ర ఆవిష్కరణ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : నియోజవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో జూన్ నెలలో 2,3,4 తేదీల్లో హార్ట్ ఫుల్ నెస్ సంస్థ శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో "ధ్యానోత్సవం" పేరుతో ఉచిత ధ్యాన శిక్షణ ఏర్పాటు చేశారు. గురువారం మండలంలోని ధర్మవరం గ్రామంలో నియోజవర్గ వైసిపి నేత, నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు, ఎంఎంఆర్ ట్రస్ట్ అధినేత ముదునూరి మురళి రాజు చేతుల మీదుగా ధ్యానోత్సవం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళి రాజు మాట్లాడుతూ ధ్యానంతో మనిషికి జ్ఞాపకశక్తి, ఒత్తిడిని తగ్గిస్తుందని, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలను తగ్గించడంలో ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ ధ్యానోత్సవంలో పాల్గొని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. హార్ట్ ఫుల్ నెస్ సంస్థ శిక్షకులు కోలా వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ ధ్యానం వలన భౌతిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమం ప్రత్తిపాడులో మురళి రాజు గెస్ట్ హౌస్‌లో జూన్ 2, 3, 4 తేదీల్లో సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు ప్రతిరోజు ఒక గంట ఉచిత ధ్యాన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 15 సంవత్సరాలు వయస్సు దాటిన వారందరూ శిక్షణలో పాల్గొనవచ్చునని, మరిన్ని వివరాలకు 9490633688 ఫోన్ నెంబర్‌కి సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామ రాజు, కోలా తాతబాబు, వెంకటేశ్వర్రావు, జువ్వల దొరబాబు, పెద్దిరెడ్డి గంగారావు, రామకుర్తి రాజబాబు, కాశి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

విశాలాంధ్ర - రౌతులపూడి : కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పర్యటించారు కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం దాటిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. రౌతులపూడి మండలం లచ్చిరెడ్డి పాలెంలో గిరిబాబు పర్యటించారు. గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ ప్రముఖుడు మాజీ ఎంపీటీసీ యెనుముల రాజబాబు విగ్రహానికి గిరిబాబు పూలమాలవేసి నివాళులర్పించి గ్రామానికి రాజబాబు చేసిన సేవలను కొనియాడారు. రాజబాబు కుటుంబంతో మా కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. వైస్ ఎంపీపీ సూర్రెడ్డి సాయి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో గిరిబాబు పాల్గొన్నారు. గిరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి పార్టీకి ఉన్న ఆదరణ తగ్గలేదని ప్రజల్లో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి ప్రజలు మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి, జడ్పిటిసి గొల్లు చిన్న దివానం, వాసిరెడ్డి జమీల్ చింతకాయల సత్యనారాయణ, కాకి నాని, గొల్లు వెంకటరమణ, పులి మధు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి విగ్రహం ధ్వంసం పై ఆందోళన

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : మండల కేంద్రమైన కొత్తపల్లి ఊర చెరువు సెంటర్‌లో ఉన్న దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా విగ్రహం ధ్వంసం పై గురువారం వంగవీటి మోహన్‌రంగా అభిమానులు ఆందోళన నిర్వహించారు. ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో ఓర చెరువు సెంటర్ వద్ద బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలంటూ డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై వెంకటేష్ ఉద్రిక్తతను అదుపు చేశారు. మోహనరంగా అభిమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు.

విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్ట్ : వరసలు సెంటర్లో ఉన్న వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. మండల కేంద్రమైన కొత్తపల్లి ఎస్సి పేటకు చెందిన పెట్ట శ్రీకాంత్ గురువారం తెల్లవారుజామున విగ్రహానికి సంబంధించి రెండు చేతులను విరిచి స్థానికంగా ఉన్న చెరువులో పడవేసినట్లు గుర్తించారు. అరెస్టు చేసి రిమాండ్‌గా తరలించినట్లు తెలిపారు.

బొబ్బర్లంక-లొల్ల ఆర్ అండ్ బి రోడ్డు మూసివేత

బొబ్బర్లంక నుంచి వేమగిరి మీదుగా ట్రాఫిక్ మళ్ళింపు

విశాలాంధ్ర-ఆత్రేయపురం : ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామ సమీపంలో సైఫాన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆర్ అండ్ బి రోడ్డును తొలగించి పైప్ లైన్ నిర్మాణ పనులు చేపట్టిన నేపథ్యంలో బొబ్బర్లంక ఊబలంక రోడ్డును లొల్ల వరకు అధికారులు తాత్కాలికంగా మూసివేసారు. దీంతో వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి బొబ్బర్లంక మీదుగా వచ్చే భక్తుల వాహనాలను ధవళేశ్వరం, వేమగిరి మీదుగా రావులపాలెం వైపు మళ్లించారు. కొవ్వూరు, నిడదవోలు, రాజమహేంద్రవరం నుంచి వాడపల్లి ఆలయానికి వచ్చే భక్తులు ట్రాఫిక్ మళ్లింపు నేపథ్యంలో ధవళేశ్వరం, వేమగిరి వయా రావులపాలెం మీదుగా వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి రావాలని ఆత్రేయపురం ఎస్సై ఎం రాము సూచించారు.

సినిమా థియేటర్‌లో తహశీల్దార్ తనిఖీలు

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని రాజోలు, తాటిపాక గ్రామాలలో సినిమా థియేటర్లను రాజోలు తహశీల్దార్ ప్రసాద్ తనిఖీ చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నాలుగు థియేటర్లలో తనిఖీలు నిర్వహించి థియేటర్ల లైసెన్సులు, టాయిలెట్స్, పరిసరాలు, ఫైర్ సేఫ్టీలను పరిశీలించామని తహశీల్దార్ తెలిపారు. టాయలెట్స్, పరిసరాలు శుభ్రపరిచి ఉన్నాయి. రాజోలు థియేటర్‌కు ఫారం-దీ లైసెన్స్ రెన్యూవల్ అయింది. మిగిలిన థియేటర్ల వారు ఫారం-దీ లైసెన్స్ రెన్యూవల్ కోసం ఆర్డీవోకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. తనిఖీ సమయములో థియేటర్ల యందు సినిమాలు ప్రదర్శించక పోవుట వలన కేంటిన్లు మూసివేశారు. తినుబండా రాల రేట్లు క్వాలిటీకి సంబంధించి లీగల్ మెట్రాలజి, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. తనిఖీ నివేదికలను అధికారులకు పంపించామని తెలిపారు. ఆయన వెంట వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధే లక్ష్యం

- డిపిటివోగా వైఎస్ఎన్ మూర్తి బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) అభివృద్దే తమ లక్ష్యంగా ముందుకు వెళ్తామని తూర్పు గోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి డిపిటివో వైఎస్ఎన్ మూర్తి అన్నారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో కార్యాలయం నందు ఈ నెల 28న బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా విధులు నిర్వహించిన ఈయన పదోన్నతి పై ఇక్కడికి విచ్చేశారు. దీనిలో భాగంగా ఆర్టీసీకి చెందిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఇప్పటివరకు అదనపు డిపిటివోగా విధులు నిర్వహించిన రాఘవ కుమార్ తిరిగి అమలాపురం డివిజన్ కి బదిలీపై తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని, సమష్టి కృషితో మరింత పురోగతి సాధిస్తామని చెప్పారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడం జరుగుతుంద న్నారు. ప్రయాణీకులకు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్ కు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను, పుణ్య క్షేత్రాలు వివాహ శుభకార్యాలకు ప్రత్యేక బస్సులు, తదితర సౌకర్యాలు ప్రజలు వినియో గించుకోవాలని కోరారు. అనంతరం పలువురు ఉద్యోగులు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కి చెందిన పర్సనల్ ఆఫీసర్ కె.రవి, డి.గంగాధర్, బి.శివ కుమార్, కెవి. హనుమంతరావు,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల బదీల కౌన్సెలింగ్

విశాలాంధ్ర - కాకినాడ : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు సాధారణ బదిలీల్లో భాగంగా గురు వారం కాకినాడ కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇంచార్జ్ రాహుల్ మీనా కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లా డుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు బదిలీ దరఖాస్తులు పరిశీలించి ఐదు సంవత్సరాలు నిండిన ఉద్యోగులను, వివిధ కారణాల చేత రిక్వెస్ట్ బదిలీలు కోరిన 15 మంది ఉద్యోగులను వారు ఎంచుకున్న ఆప్షన్ల ప్రకారం ఎటువంటి వివా దాలకు తావివ్వకుండా పారదర్శకంగా బదిలీ చేయడం జరిగిందన్నారు. ఉద్యోగులు బదిలీ కాబడిన ప్రదేశంలో గ్రంథాలయాల అభివృద్ధికి తగిన కృషి చేయాలన్నారు. తమ పరిధిలోని గ్రంథాలయ సెస్ వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జేసీ ఈ సందర్భంగా ఉద్యోగులకు సూచించారు. అనంతరం ఆయన చేతులు మీదుగా బదిలీ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఇంచార్జి కార్యదర్శి పాలంకి నాగరాజు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టీ జయకృష్ణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగాలి

- కానవరంలో డ్వాక్రా సంఘాల మహిళలతో కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - రాజానగరం : ప్రతి మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగాలనీ, తమ జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలనీ తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-సెర్ప్ ఆధ్వర్యంలో డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్వీవీఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన బుధవారం సాయంత్రం జరిగిన మహిళా సంఘాల జీవనోపాధుల వార్షిక రుణ జీవనోపాధుల ప్రణాళికను కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి విచ్చేశారు. డ్వాక్రా మహిళా సంఘాలు చేపడుతున్న వివిధ ఆర్థిక అంశాలను పర్యవేక్షించారు. దీనిలో భాగంగా సంఘ సభ్యుల ఆర్థికపురోభివృద్ధికి పలు సలహాలు, సూ చనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ స్వయం సహాక సంఘాల్లోని మహిళలు తమ జీవన ప్ర మాణాలను మెరుగుపర్చుకోవాలని, అందుబాటులో ఉన్న వనరులు, ప్రభుత్వ పథకాలను అందిపుచ్చు కుంటూ ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, సామాజిక పెట్టుబడి (సీఐఎఫ్) రుణాలను విరివిగా పొందేందుకు ఇటువంటి ముందస్తు వార్షిక రుణ ప్రణాళికలు దోహదపడతాయన్నారు. సంఘ సభ్యులు మాట్లాడుతూ ముందస్తు కార్యాచరణ వల్ల ఎంతో మేలు చేకూరుతుందన్నారు. సంఘాల్లోని సభ్యులకు ఎవరికి ఎప్పుడు రుణం అవసరం, ఎంత అవసరమో ముందస్తు ప్రణాళిక ద్వారా సాధ్యపడుతుందంటూ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్ డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్వీవీఎస్ఎన్ మూర్తి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు ఎ.శ్రీనివాసరావు, ఇ.శ్రీనివాస బాబు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ జి.సునీత, క్లస్టర్ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ శాఖలో ఉద్యోగస్తుల

బదిలీలు పారదర్శకంగా జరగాలి

విశాలాంధ్ర - కడియం : రాజమండ్రి రూరల్, ధవలేశ్వరం ఇరిగేషన్ శాఖలో ఉద్యోగస్తుల బదిలీలు పారదర్శకంగా జరగాలని తెలుగుదేశం ధవళేశ్వరం గ్రామ అధ్యక్షులు పందూరి అప్పారావు, తెలుగుదేశం ధవళేశ్వరం క్లస్టర్ ఇన్‌ఛార్జ్ తలారి మూర్తి ఇరిగేషన్ ఉన్నతాధికారులకు వినతి పత్రం సమర్పించారు. 5 సంవత్సరాల కాలం పూర్తి చేసిన ప్రతి ఉద్యోగస్తుడు తప్పనిసరిగా బదిలీ కావలసి ఉండగా, కొందరు అక్రమంగా తప్పుడు సిఫారసులతో ఉద్యోగ సంఘ నాయకులం అంటూ ఉన్నచోటనే అదేసీటు అంటి పెట్టుకుని 20 సంవత్సరాలుగా కదలని వాళ్ళు ఎందరో ఉన్నారని, అత్యవసరంగా న్యాయంగా ఇక్కడికి రావలసిన ఎందరో ఉద్యోగస్తులకు అన్యాయం చేస్తూ, లంచాలకు అక్రమాలకు తెరతీసి కోట్లకు పడగలెత్తారని, వీరి బాగోతం బయట పడటంతో ఆఫీస్ నుండి ఆఫీస్ కు మారటానికి ప్రయత్నం చేస్తూ ఇదే చోట ఉండే ప్రయత్నం చేస్తున్నారు తప్ప ఇక్కడ నుండి వేరే ఊరు కదలటం లేదని, ఇటువంటి అన్యాయాలకు తావు లేకుండా రూల్స్ కి అనుగుణం గా వీరిని మరొక ఊరికి బదిలి చేయాలని, న్యాయ బద్ధంగా ఇక్కడికి రావలిసిన ఉద్యోగస్తులకు న్యాయం చేయాలని కోరుతూ ఎస్ఇ ఇరిగేషన్ ధవళేశ్వరం, సిఇ ఇరిగేషన్ దవళేశ్వరం వారికి మరియు దవళేశ్వరం నాగో అసోసియేషన్ వారికి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు సమస్య పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలియచేసారు. ఈ సమస్యను త్వరలోనే స్థానిక శాసన సభ్యులు, ఇరిగేషన్ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ తదితరుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారంకు కృషి చేస్తామని స్థానిక తెలుగుదేశం నాయకులు తెలిపారు.

యోగా దినోత్సవం శిక్షకులచే యోగా ఆసనాలు

విశాలాంధ్ర-కపిలేశ్వరపురం : బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వర పురం మండలం బిఆర్ అంబేద్కర్ కోన సీమ జిల్లా మండల కేంద్రం కపిలేశ్వర పురం గ్రామంలో గల ఎంపీపీ కార్యాలయంలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగా శిక్షకులచే యోగా ఆసనాలు చేయించారు. మానసిక, శారీరక దృఢత్వానికి యోగా దివ్యౌషధం అని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. యోగా ఒక మతానికి సంబంధించిన అంశం కాదని, ప్రతీ ఒక్కరు యోగాను తమ జీవన శైలిలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగా ఆవశ్యకత పై విస్తృత ప్రచారం కల్పిస్తున్నారని ఎంపిడివో తెలిపారు. శిక్షకులు ఎమ్.సత్యనారాయణ, మేకా సత్య నారాయణలచే ప్రభుత్వ సిబ్బంది, రాజకీయ నాయకులు, రైతులు చేత వివిధ భంగిమలతో యోగా ఆసనాలు చేయించారు. ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

730 కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర-దేవరపల్లి: ఒరిస్సా నుంచి హైదరాబాద్ లారీలో 22 లక్షల విలువ చేసే 730 కేజీల గంజాయి పట్టుకున్న పోలీసులు గురువారం దేవర పల్లి సర్కిల్ కార్యాలయం నందు విలేకర్ల సమావేశంలో సీఐ బి నాగేశ్వర నాయక్ మాట్లాడారు. హైదరాబాద్ కు చెందిన ఏపీ 16 టీఎక్స్ 5319 నెంబర్ గల లారీ గంజాయిని రహస్య క్యాబిన్లో తీసుకుని వెళ్తుండగా దేవర పల్లి డైమండ్ జంక్షన్ సమీపంలో గోల్డెన్ ఫిష్ దాబా దగ్గర ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో భార్యాభర్తల దుర్మరణం చెందారన్నారు. పోలీసులు పట్టుకుంటారనే భయంతో నిందితుడు లారీ ఆపకుండా నేషనల్ హైవేలోని ఎర్నగూడెం గ్రామ శివారులోని ఓ పొలం వద్ద ఉన్న ఇటుకల బట్టి వద్ద కనపడకుండా పార్క్ చేశారన్నారు. బుధవారం ఎస్సై సుబ్రహ్మణ్యానికి వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి గంజాయి ఉన్న లారీని స్వాధీనం చేసుకున్నారన్నారు. లారీ ఓనర్ అండ్ డ్రైవర్ కర్రే శ్రీశైలం హైదరాబాద్ చర్ల పల్లికి చెందిన వాడని ఇతనపై 2023లో గంజాయి రవాణా చేస్తూ చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయిందని ప్రస్తుతం బెయిల్ మీద ఉన్నాడన్నారు. అలాగే ఈ కేసులో హైదరాబాద్ కి చెందిన నర్సిరెడ్డి, యాదయ్య అనే మరో ఇద్దరు నిందుతులు ఉన్నారన్నారు. నిందితుడు వద్ద నుంచి లారీ, ఫోన్, వెయ్యి రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో దేవరపల్లి ఎస్సై సుబ్రహ్మణ్యం హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి చంద్రశేఖర్ రమణ షేక్ సలీం పి రామారావును జిల్లా ఎస్పీ అభినందించా రాన్నారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరిచి రిమాండ్ కి తరలిస్తున్నామని సిఐ నాగేశ్వర్ నాయక్ తెలిపారు.

యోగాతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర - ఆలమూరు : యోగాతో శ్వాస, శక్తి, ప్రశాంత కలుగుతుందని ఎంపీడీవో ఏ రాజు పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాలలో భాగంగా గురువారం మండల కేంద్రమైన ఆలమూరులో కాపు కళ్యాణ మండపం నందు రైతులతో యోగాంధ్ర దే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా యోగ ట్రైనింగ్ టీచర్ ధర్మాజీ రైతులకు యోగ పై అవగాహన కల్పించి వివిధ రకాల యోగాసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో ఒత్తిడికి గురవుతారని ఒత్తిడి నుండి విముక్తి పొందాలంటే యోగ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. యోగా మనిషి జీవితంలో ఒక భాగం కావాలని, సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని తెలిపారు. యోగా సాధనలో మానసిక సమస్యలు, శారీరక రుగ్మతం నుంచి విముక్తి లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు కాకి నాగేశ్వరరావు, ఏవో లక్ష్మీ లావణ్య, సచివాలయం సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

బిందెలతో నిరసన చేపట్టిన బాధితులు

* సీపీఐ కార్యదర్శి కళింగ లక్ష్మణరావు

విశాలాంధ్ర పెంటపాడు : పెంటపాడు మండలం రావిపాడు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర గుడి ప్రక్కగల బీసీల నివాస ప్రాంతంలో ప్రజలకు గ్రామ పంచాయతీ త్రాగునీరు అందించడంలో గత ప్రభుత్వం విఫలమైందని,ఆ కారణం చేత గత ఐదు సంవత్సరాల నుండి తాగునీటిని ప్రైవేటుగా కొనుగోలు చేసుకోని జీవనం కొనసాగిస్తున్నారని సీపీఐ పెంటపాడు మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ఆరోపించారు. గురు వారం రావిపాడు గ్రామానికి సందర్శించిన కళింగ లక్ష్మణరావు బాధిత నివాస ప్రాంతానికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. కాలువ నీటిని వాడుకోవడానికి ఉపయోగిస్తున్నారని, ప్రభుత్వం ఈ విషయంపై స్పందించే బీసీ కాలనీలో మంచినీటిని సఫర్ చేయా లని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రాంతంలో రోడ్డు కూడా లేదని,వర్షాకాలం వస్తే మనుషులు వెళ్లడానికి కూడా వీలు లేని పరిస్థితి ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలు పరిష్కారం చేయమని సర్పంచ్ మరియు పంచాయతీ కార్యదర్శి, గ్రామ నాయకులు దృష్టికి తీసుకువెళ్లిన వారి సమస్యలను పట్టించుకునే నాధుడు కరువయ్యారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రజలను ఓట్ల కోసమే ఉపయోగించుకుంటున్నారని తర్వాత వారి సమస్యలను గాలి వదిలేస్తున్నారని ఆయన మండిపడ్డారు. వీరు నివాస ప్రాంతం చూస్తే మానవ హక్కులు హరించే విధంగా ఉన్నాయని ఆయన తీవ్ర అసహనం వ్యక్తపరిచారు. ఈ సమస్యపై మండల అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని తాగునీరు , రోడ్డు పరిష్కరించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దిద్దే నాగేశ్వరావు బాధితులు తాటిపర్తిగంగ, తాటిపర్తి మంగ, టి చిన్ని, చిన్నారి, టి చిన్నారావు, టీ బుల్లియ్య,టి రాముడు,టి సజీవ కుమారి, టి దుర్గా, టి మహంకాళి, టి రమేష్ తదితరులు పాల్గొన్నారు

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- ఎన్నికల వాగ్దానాల్లో ఇళ్ల స్థలాలు హామీలను తక్షణమే అమలు చేయాలి
- జూన్ 2న ఇళ్ల స్థలాలపై సీపీఐ నిరసన

విశాలాంధ్ర - కాకినాడ : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఎస్ అచ్చుతాపురంలో స్థానిక అంబేద్కర్ స్టాట్యూ వద్ద సీపీఐ నగర కార్యదర్శి టి అన్నవరం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలపై జూన్ 2న జరిగే సిపిఐ నిరసన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పోస్టల్ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ప్రసాద్ సందర్భంగా మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో పేద ప్రజలకు ఇళ్ల స్థలాల మంజూరు చేస్తామని, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు భూమిని, అర్బన్ ప్రాంతంలో రెండు సెంట్లు భూమిని మంజూరు చేస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో హామీలు ఇచ్చిందని ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం పూర్తి అవుతున్న ఇక్కడికి ఆహామీలను నెరవేర్చ లేదని ఆయన ఆవేదనవ్యక్తం చేశారు. పేద ప్రజలకు సొంత ఇల్లు లేక, ఇంటి అద్దెలు కట్టుకోలేక తీవ్రత ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన పట్టాలకు స్థలం చూపించాలని, రూ. 5 లక్షల లోన్లు మంజూరు చేయాలని, అర్హులైన నిరుపేదలం దరికీ కొత్త పట్టాలు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు మంజూరు పై ప్రజా ప్రతినిధులు స్పందించాలని, ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చా లని, అర్హులైన పేద ప్రజలందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. వృద్ధాప్య వితంతు పెన్షన్లను ఏ ఒక్కటి తొలగించకుండా పూర్తి స్థాయిలో అందరికీ అమలు చేయాలని, జూన్ 2న ఇళ్ల స్థలాలపై సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ఆందోళన చేపడుతామని ప్రసాదమన్నారు. కార్యక్రమంలో రాజేష్, అచ్చారావు, ప్రసాద్, వీర బాబు, కుమార్‌లు పాల్గొన్నారు.

ఆర్జీలను పరిష్కరించేలా చర్యలు : కలెక్టర్

-పీజీఆర్ఎస్‌లో అందచేసిన ఆర్జీల పరిష్కార స్థాయికి 1100 దయల్ చేసి తెలుసుకోవచ్చు : కలెక్టర్ పి ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం వస్తున్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, పరిష్కారం కానీ వాటి విషయంలో ప్రత్యక్షంగా ఆయా వ్యక్తుల, అధికారులు లతో సమావేశం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌పై ప్రజాసమస్యల పరిష్కర స్థాయి పై వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీ దారులతో అధికారులతో కలెక్టర్ వ్యక్తిగతంగా సమావేశం అయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేకి సంబంధించిన రాజానగరం గురించి మూడు అర్జీలు, కోరుకొండ 1, చాగల్లు 6 అర్జీలు పరిశీలించడం జరిగింద న్నారు. పరిష్కారం అయ్యే వాటి విషయంలో ఖచ్చితత్వం జవాబుదారీ తనం కలిగి ఉండాలనీ ఆదేశించారు. ఉద్దేశ్య పూర్వకంగా జాప్యం చేసే వారి విషయం లో ఉపేక్షించే ప్రసక్తి లేదని పేర్కొన్నారు. రాజానగరం మండలం నుంచి ఎర్రంశెట్టి నాగేశ్వరరావు, జూపూడి మధుబాబు, ఎలగ నర్సారెడ్డి, షేక్ నజీర్ లు వారి భూములు రీసర్వే చేయాలని సంబంధించిన అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ప్రజలకి ఏ మాత్రం ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 మీ సెల్ ఫోన్ల లో నిక్షిప్తం చేసుకోవాలన్నారు.

అధ్వాన్నంగా డ్రెయిన్‌ల నిర్వహణ

విపరీతమైన దోమలతో ప్రజల ఇక్కట్లు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పట్టణంలోని గాంధీనగర్‌లో వాటర్ పైప్ లైన్ నిమిత్తం గోతులు తవ్వి ఆ మట్టిని డ్రైనేజీలో వేయడంతో మురుగునీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిలిచిపోయిన మురుగు జలాలతో దోమలు విపరీతంగా పెరిగి పోవడంతో అక్కడి ప్రజలు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైను పనులు పూర్తయ్యి రెండు వారాలు గడుస్తున్నా నేటికీ డ్రెయిన్లు శుభ్రం చేయకపోవడంతో స్థానిక ఆందోళన చెందుతున్నారు. పురమిత్ర యాప్‌లో ప్రజలు అర్జీ పెట్టినప్పటికీ ఫలితం లేదని వారు వాపోతున్నారు. అధికారులు తక్షణం స్పందించి డ్రెయిన్‌లో మట్టి తొలగించి మురుగు నీటిని బయటకు పంపించి దోమలను నిర్మూలించి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

సమిశ్రగూడెం ఎస్సైగా బాలాజీ సుందరరావు

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు మండలం సమిశ్ర గూడెం ఎస్సైగా ఎల్. బాలాజీ సుందర రావు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకోటసత్తెమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఎసై బాలాజీ సుందర రావు మాట్లా డుతూ సమిశ్ర గుడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిడదవోలు రూరల్ గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడడంతో పాటు లా అండ్ ఆర్డర్‌ను అమలు చేస్తూ యువతను సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేస్తానని బాలాజీ తెలిపారు.

జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పొడిగింపు

విశాలాంధ్ర - అమలాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పాటు జూన్ 1,2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల గురువారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పని చేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని ఆ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల తెలిపారు.

యల్లాపురంలో కరోనా కలకలం

విశాలాంధ్ర-ముసునూరు: మండలంలోని యల్లాపురం గ్రామానికి చెందిన వ్యక్తి(52)కి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అవటంతో మండల వ్యాప్తంగా కలకలం రేగింది. ముసునూరు పిహెచ్‌సీ వైద్యురాలు షకీలా ఇవాంజెలిన్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్లాపురం గ్రామానికి చెందిన వ్యక్తి హైదరాబాదు లోని శుభకార్యానికి హాజరై తిరిగి వచ్చిన క్రమంలో జలుబు తుమ్ములతో అస్వస్థతకు గురై ఏలూరు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోగా కరోనా పాజిటివ్ గా నిర్ధారణ అయ్యింది. ఈ క్రమంలో వారిని,హౌస్ ఐసోలేషన్లో ఉంచినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగుతూ, మరోపక్క వ్యవసాయ పనులకు రైతాంగం సన్నద్ధమవుతున్న తరుణంలో కరోనా కేసులు నమోదవడం ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. వచ్చేనెల జూన్‌లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్న తరుణంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ మాస్కు ధరించి ఎప్పటికప్పుడు,శానిటైజర్‌తో చేతులను శుభ్రపరుచుకోవాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య అధికారి షకీలా ఇవాంజెలియన్ ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

సైనిక్ సంక్షేమ నిధి విరాళాలు వారి ఆర్థిక భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : జిల్లాలో సైనిక్ సంక్షేమ నిధికి వచ్చిన విరాళాలు ఇచ్చి సైనికులు, వారి కుటుంబాల ఆర్థిక భరోసా, సంక్షేమ భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పిడి, డిఆర్డిఏ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల గ్రూపులు అందించిన 6,37,790 రూపాయలు చెక్కును జిల్లా కలెక్టర్, ఎస్పీ వారి చేతుల మీదు సైనిక్ వెల్ఫేర్ అధికారికి కు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం పోరాడిన సైనికుల కోసం సైనిక్ వెల్ఫేర్ ఫండ్ కి ప్రతి ఒక్కరూ తమ వంతుగా స్వచ్ఛందంగా సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. స్వయం సహాయక సంఘాలు సైనిక్ వెల్ఫేర్ ఫండ్‌కి విరాళాలు ఇవ్వడం అభినందనీ యమన్నారు. ఈ విషయంలో వారు ఎందరికో స్ఫూర్తి ఆదర్శం అన్నారు. ఎస్పీ డి నరసింహా కిషోర్ మాట్లాడుతూ, సైనిక్ సంక్షేమ నిధి ద్వారా సేకరించిన నిధులు మాజీ సైనికులు, యుద్ధ వితంతువులు, వికలాంగులైన మాజీ సైని కులు, రక్షణ సిబ్బంది కుటుంబాల సంక్షేమం మరియు పునరావాసం కోసం ఏర్పాటు చేయబడిందన్నారు. ఈ నిధి ద్వారా, వారి కోసం వివిధ సంక్షేమ పథకాలు, సహాయ కార్యక్రమాలు అమలు చేయబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డి నరసింహా కిషోర్, డి ఆర్ డి ఏ పిడి ఎన్వివి ఎస్ మూర్తి, సైనిక్ సంక్షేమ అధికారి సహాయ సంచాలకులు డాక్టర్ సత్యకుమార్, డిపిఎం బి హేమంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.